క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ తనిఖీ



పట్టుబడ్డ వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

గంభీరావుపేట(సిరిసిల్ల): మండల పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు.కేసుల పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. పనిచేయని సీసీ కెమెరాలను వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ శశిధర్ రెడ్డి, ఎస్సై రామ్మోహన్, సిబ్బంది ఉన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ

బోయినపల్లి: మండలంలోని అనంతపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చన్నారు. ఎస్సై ఎల్. శ్రీకాంత్, మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, పర్శ మల్లేశం ఉన్నారు.

సాహిత్య సృజన చేయాలి



మాట్లాడుతున్న బాల సాహితీవేత్త వీఆర్ శర్మ

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు సాహిత్య సృజన చేయాలని బాలసాహితీవేత్త, రచయిత డాక్టర్ వీఆర్ శర్మ కోరారు. మండలంలోని దుమాల ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులకు కథలు, గేయాలు, పద్యాలు, వ్యాసాలు రాయడంలో మెళకువలపై అవగాహన కల్పించారు. ప్రైమరీ, హైస్కూల్‌తోపాటు ఇటీవల ప్రారంభించిన ఇప్ప వజ్రమ్మ–నారాయణరెడ్డి స్మారక గ్రంథాలయాలని పుస్తకాలు అందించారు. రిటైర్డ్ హెచ్‌ఎం టి.హన్మండ్లు, టీపీటీఎఫ్ కామారెడ్డి జి ల్లా ప్రధాన కార్యదర్శి చకినాల అనిల్, ఎంప్లాయీస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, సభ్యులు రాజశేఖర్, సత్యం పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐగా శ్రీనివాస్



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపే ట ఎక్సైజ్ సీఐగా శ్రీని వా స్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రా త్రి ఉత్తర్వులు విడుదల చేసింది. సుదీర్ఘకాలం ఇక్కడ పనిచేసిన చంద్రశేఖర్ హైదరాబాద్‌లోని ఆబ్కారీ శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

భూమిపూజ

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లిలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న మహిళా ఫంక్షన్‌హాల్‌కు గురువారం ఎంపీపీ పడిగెల మానస భూమిపూజ చేశారు. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సహాయంతో నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఎంపీటీసీ లావణ్య ఆంజనేయులు, మాజీ సర్పంచ్ రమేశ్, బాలమల్లు, శ్రీనివాస్, పర్శరాములు, బలరాం, అమర్ రావు, ప్రభాకర్ రావు, మహేశ్, రమేశ్, వినేష్, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

'గావ్ చలో అభియాన్'

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బీజేపీ రాష్ట్ర నాయకురాలు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రాణి రుద్రమ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అంకిరెడ్డిపల్లెలో 'గావ్ చలో అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్తులతో మాట్లాడారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు స్థానిక ఎంపీటీసీ రాగుల రాజిరెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

చందుర్తి : రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం చేప ట్టనున్న బంద్‌ను ఆటో కార్మికులు విజయవంతం చేయాలని మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు బత్తుల కమలాకర్ కోరారు. మండలకేంద్రంలో అన్నిగ్రామాల ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. మహాలక్ష్మి పథకంతో ఆటోడ్రైవర్ల ఉపాధి పూర్తిగా దెబ్బ తిందన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని హమాలీ సంఘం అధ్యక్షుడు పిట్ల రంగయ్య కోరారు. గ్రామీణ భారత్‌బంద్‌లో రైతులు, కార్మికులు లక్షలాదిగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

హైలెవల్ వంతెనల నిర్మాణమెప్పుడో?

- కల్వర్టులపై వరదనీటితో రాకపోకలకు ఇబ్బందులు
- ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- నిధులు మంజూరులో జాప్యం
- వాహనదారుల ఇబ్బంది



ఆవునూర్, పోతుగల్ మధ్య ఉన్న లో లెవల్ వంతెన

ముస్తాబాద్: ప్రధాన రహదారులపై లో లెవల్ వంతెన ప్రమాదకరంగా మారాయి. ఏడాది కల్వర్టుల స్థానంలో హై లెవల్ వంతెనలు నిర్మించాలన్న ప్రతిపాదనలు చేయడం, చివరకు నిధులు మంజూరు కాకపోవడం జరుగుతోంది. కొత్త ప్రభుత్వం ఇంకా నిధుల కేటాయింపులు జరపకపోవడంతో హైలెవెల్ వంతెన నిర్మాణాలు ఇప్పట్లో జరిగేలా లేవు. మండలంలోని ప్రధాన రహదారుల్లో పలుచోట్ల లో లెవెల్ వంతెనలు ఉన్నాయి. కొన్నింటికీ నిధులు మంజూరై టెండర్లు వేసినా, ప్రభుత్వం మారడంతో అగ్రిమెంట్లు నిలిచిపోయాయి. దీంతో హైలెవల్ వంతెనల నిర్మాణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ప్రతిపాదనలకే పరిమితం

ముస్తాబాద్ నుంచి కామారెడ్డి ప్రధాన రహదారిపై ఐదు చోట్ల హైలెవెల్ వంతెనలు నిర్మించాల్సి ఉంది. ముస్తాబాద్ నుంచి తెర్లుమద్ది మీదుగా సిరిసిల్ల వైపుకు వెళ్లే రహదారిలో రెండు వంతెనలు, మండల కేంద్రం నుంచి పోతుగల్ మీదుగా సిరిసిల్లకు వెళ్లే రహదారిలో పోతుగల్ శివారు ఎల్లమ్మ వాగుపై వంతెనలు నిర్మించాల్సి ఉంది. పోతుగల్ నుంచి ఆవునూర్‌కు వెళ్లే రోడ్డులో కొండచెరువు వద్ద లోలెవెల్ వంతెన ప్రమాదకరంగా మారింది. ముస్తాబాద్ శివారులోని కామారెడ్డి రోడ్డులో బగ్గవాగుపై వంతెన నిర్మాణానికి రూ.5 కోట్ల ప్రతిపాదనలు చేశారు. అయినా మంజూరు కావడం లేదు. లింగన్నపేట వద్ద రెండు లో లెవెల్ వంతెనలు, నర్మాల ప్రాజెక్టు కింద మూడు కల్వర్టుల వద్ద భారీ హైలెవల్ వంతెనల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేసినా నిధులు మంజూరు కావడం లేదు. ఏటా వానకాలంలో ఈ రహదారులపై కాజ్‌వేలు, లో లెవెల్ వంతెనలపై నుంచి భారీగా వరద నీరు వెళ్తోంది. భారీ వర్షాలకు రెండు మూడ్రోజులు రాకపోకలు నిలిచిపోతున్నాయి.

కొత్త సర్కార్ ఏర్పాటు తర్వాత..

ముస్తాబాద్ నుంచి దుబ్బాక వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులకు మాజీ మంత్రి కేటీఆర్ రూ.22 కోట్లు మంజూరు చేయించారు. టెండర్ పూర్తైంది. డిసెంబర్ 7 తర్వాత అగ్రిమెంట్ జరగడంతో ఆ పనులు నిలిపివేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదేశించినట్లు తెలిసింది. దీనిపై రెండుచోట్ల వంతెనలు నిర్మించాల్సి ఉంది. ఎన్నో ఏళ్లుగా రెండు జిల్లాల ప్రజలు ఈ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని కోరుతున్నా మరోసారి సందిగ్ధం నెలకొంది. గూడెం నుంచి కొండాపూర్ వెళ్లేదారి వరద నీటికి కొట్టుకుపోయింది. ఇక్కడ రెండుచోట్ల వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉంది.

వంతెన నిర్మించాలి



తెర్లుమద్ది నుంచి జిల్లెల వెళ్లే రహదారి పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. నక్కవాగుపై రెండు వంతెన పనులు పూర్తిచేయాలి. ఐదేళ్లుగా పనులు జరుగుతున్నాయి. వానాకాలంలో అటువైపు వెళ్లడం చాలా కష్టమవుతోంది.

– కలకొండ కిషన్‌రావు, మాజీసర్పంచ్, తెర్లుమద్ది

నిధులు మంజూరుచేయాలి



ముస్తాబాద్, కామారెడ్డి ప్రధాన రహదారిపై బుగ్గవాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. వానాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగు అవతల ఉన్న గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిధులు మంజూరు చేయాలి.

– మహ్మద్ సర్వర్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు

ప్రతిపాదనలు తయారు



ముస్తాబాద్ నుంచి కామారెడ్డి వైపుకు వెళ్లే రహదారిలో ఉన్న ఐదు వంతెనలకు ప్రతిపాదనలు తయారుచేశాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. అలాగే మోహినికుంట రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. తెర్లుమద్ది వైపు పనులు కొనసాగుతున్నాయి.

– నరేందర్, ఏఈ ఆర్‌అండ్‌బీ

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి



అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్

వేములవాడరూరల్: విద్యార్థులు పరీక్షల్లో భయం వీడి ఉత్తమ ఫలితాలు సాధించాలని లయన్స్ క్లబ్ ఉమ్మడి జిల్లా గవర్నర్ మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండలంలోని నూకలమర్రి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో రూరల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గొస్కుల రవి, క్యాషియర్ ప్రవీణ్, ప్రధానోపాధ్యాయుడు బూర సదానందం, మాజీ ఏఎంసీ డైరెక్టర్ అంజనీకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి

గంభీరావుపేట: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎర్ర ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రణాళికబద్ధంగా చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన నాయకులు



రుద్రంగి(వేములవాడ): మండల సమస్యలపై బుధవారం అసెంబ్లీలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే సభ్యుడు ఆది శ్రీనివాస్‌ను డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి గురువారం అసెంబ్లీ కార్యాలయంలో కలిశారు. మండల సమస్యలపై సభ దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయించేలా కృషిచేస్తున్న ఆదికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కొమురవెల్లి దేవేందర్, తదితరులున్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న భాస్కర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బాల్కని నుంచి పడి ఓ వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన శ్రీగాద భాస్కర్ (45) డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నివసిస్తున్నాడు. మొదటి అంతస్తులో ఉన్న బాల్కని నుంచి కిందికి చూసే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తీవ్ర గాయాలైన భాస్కర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఆపరేషన్‌కు రూ.లక్ష ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దాతలు ఆపన్నహస్తం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

'లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి'



సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) నేతలు డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో సార్వత్రిక సమ్మెకు మద్దతు తెలుపుతూ..కేంద్ర సర్కారు తీరుపై నిరసన తెలిపారు. వక్తలు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు కనీస మద్దతుధర చట్టాన్ని అమలుచేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కేంద్రప్రభుత్వ విధానాలతో కార్మికులు, రైతులు, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శుక్రవారం ట్రేడ్ యూనియన్లు చేపడుతున్న సార్వత్రిక సమ్మెకు మద్దతు పలికారు. యూఎస్‌పీసీ భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దొంతుల శ్రీహరి, దుమాల రమానాథ్‌రెడ్డి, అవురం సుధాకర్‌రెడ్డి, ఉత్తమ్ విజయ్‌కుమార్, మల్లారపు పురుషోత్తం, మరెల్లి విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్ మండలం కలేనా?

- ప్రకటించి నాలుగేళ్లు పూర్తి
- ఇప్పటికీ ఉమ్మడి మండలంలోనే..
- పట్టించుకోని పాలకులు
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నెరవేరేనా..?



వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయం

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ప్రకటించింది. ఇప్పటివరకు మండలం ఎక్కడా అనేది ప్రకటించకపోవడంతో పట్టణంలోనే రూరల్ మండలం కొనసాగుతోంది. 28 గ్రామాలతో మండలం ఉండగా అందులోంచి 17 గ్రామాలతో రూరల్ మండలంగా 2019 జూలై 4న ప్రభుత్వం ప్రకటించింది. ఆ సమయంలో తమ గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని చెక్కపల్లి, నూకలమర్రి గ్రామాలతో పాటు హన్మాజిపేట గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. అయినా ఏ గ్రా మాన్ని మండలంగా ప్రకటిస్తూ ప్రభుత్వం గెజిట్ ఇవ్వకపోవడంతో ఆ గ్రామాల ప్రజలు మాజీ ఎమ్మెల్యే రమేశ్ బాబు హామీతో విరమించారు. మళ్లీ ఇప్పటివరకు రూరల్ మండలం విషయంలో దృష్టిసారించకపోవడంతో నేటికీ ఉమ్మడి మండలంలోనే రూరల్ మండలం కొనసాగుతోంది.

రూ.30 లక్షలతో స్థలం కొనుగోలు

వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లి గ్రామాన్ని రూరల్ మండలంగా ప్రకటిస్తారని అప్పట్లో ప్రచారం జరిగింది. గ్రామంలో ప్రభుత్వం స్థలంలేదని మండలం కోసం గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చారు. ఇంటికి రూ.5వేల చొప్పున 20 లక్షలు వసూలు చేసి ప్రజాప్రతినిధులు, కొందరు ఎన్‌ఆర్‌ఐల సాయంతో మరో రూ.10 లక్షలు జమ చేసి రూ.30 లక్షలతో మూడున్నర ఎకరాలు కొనుగోలు చేశారు. తమ గ్రామం మండలంగా మారనుందన్న ఆనందంతో గ్రామస్తులంతా డబ్బులు జమ చేసి స్థలాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వానికి విన్నవించారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన రాకపోవడంతో నిరాశతో ఉన్నారు.

అందరికి అందుబాటులో

వేములవాడ రూరల్ మండలంలో 17 గ్రామాలుండగా ఇందులో ప్రధానంగా బొల్లారం, లింగంపల్లి, హన్మాజీపేట, మల్లారం గ్రామాలు ఒకవైపు ఉండగా ఎదురుగట్ల, చెక్కపల్లి, నూకలమర్రి, వట్టెంల, ఫాజుల్‌నగర్, నమిలిగుండుపల్లి మరో పక్క ఉన్నాయి. రెండు గ్రామాలకు మండలం అనుకూలంగా ఉండాలంటే పట్టణంలోనే కొనసాగితే అనువుగా ఉంటుందని పాలకులు భావిస్తున్నారు. కానీ ప్రత్యేక మండలంగా ప్రకటిస్తే అభివృద్ధి జరుగుతుందన్న ఆలోచనతో కొన్నిగ్రామాల ప్రజలు భావిస్తున్నారు.

సొంత భవనం కరువు..

వేములవాడ రూరల్ మండలాన్ని ప్రకటించినా మండలానికి కావాల్సిన సిబ్బంది మాత్రం లేకపోవడంతో ఉన్న సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం మండలంగా ఏర్పడగా అందులో ఎంపీడీవో, సూపరింటెండెంట్‌తో పాటు ఎంపీవో అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మిగతా సి బ్బంది అందరూ ఇన్‌చార్జిలుగానే కొనసాగుతున్నారు. మండలానికి సొంతభవనం లేకపోవడంతో జెడ్పీ గెస్ట్ హౌస్‌లోనే నాలుగేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించేనా...?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వేములవాడ రూరల్ మండలాన్ని ప్రకటించేనా అనే చర్చ జరుగుతోంది. గతంలో మండలం ప్రకటించినా పాలకులు ప్రత్యేక దృష్టి సారించలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో మళ్లీ వేములవాడ రూరల్ మండలం ఎక్కడ ప్రకటిస్తారనేది చర్చనీయాంశమైంది.

స్థలం కొనుగోలు చేశాం



వేములవాడ రూరల్ మండలంగా అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. చెక్కపల్లి గ్రామంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పాలకులు తెలపడంతో మా గ్రామంలో స్థలం కొనుగోలు చేశాం. ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఇంటింటా డబ్బులు పోగుచేసి రూ.30 లక్షలతో మూడున్నర ఎకరాలు కొనుగోలు చేశాం.

– అద్దిక జైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్, చెక్కపల్లి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పుష్పలత



అవగాహన కల్పిస్తున్న నాయకులు

బోయినపల్లి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రత్యేకాధికారి, తహసీల్దార్ పుష్పలత పేర్కొన్నారు. మండలంలోని కోరెం, అనంతపల్లి గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ యువకులు గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. పారిశుధ్య వారోత్సవాల్లో విధులు నిర్వహించిన గ్రామపంచాయతీ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ ఆశా కార్యకర్తలు, రేషన్ డీలర్ డబ్బు వెంకటరెడ్డి తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, బానిసలు కావద్దని మండల కో–ఆప్షన్ సభ్యుడు జబ్బర్, ఎంపీటీసీ ల్యాగల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. మత్తపదార్థాల వల్ల కలిగే అనార్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



వీర్నపల్లి: గిరిజనులతో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సంత్ సేవాలాల్ జయంతి

ముస్తాబాద్/ గంభీరావుపేట/తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/ రుద్రంగి: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ బంజారాల అభ్యున్నతికి పరితపించిన నాయకుడు సేవాలాల్ మహారాజ్ అన్నారు. అనంతరం ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గిరిజన నాయకులు, మహిళలు, తదితరుల పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: బుగ్గరాజేశ్వర తండాలో పూజలు చేస్తున్న గిరిజనులు



రుద్రంగి: ప్రత్యేక పూజలు చేస్తున్న గిరిజన మహిళలు

ఘనంగా రాధాకృష్ణుల కల్యాణం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లగొల్లపల్లిలోని శ్రీ గీతామందిరం వార్షికోత్సవం సందర్భంగా శ్రీరాధకృష్ణుల కల్యాణాన్ని గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం పూజలు నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం, భగద్గీత పా రాయణం, ప్రముఖుల ప్రవచనాలు భక్తులకు వినిపించారు. బ్రహ్మశ్రీ రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు పాలెపు రవీందర్‌శర్మ, నరహరిశర్మ, రాముశర్మ, విద్యాదరశర్మ, సందీప్‌శర్మ, బ్రహ్మచారి లక్ష్మారెడ్డి కల్యాణం, పూజలు నిర్వహించారు. దుబ్బ విశ్వనాథం, రాంరెడ్డి, శ్రీకర్, శాగ రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **ఆలయానికి విరాళం**

కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ రూ.10వేలు అందించారు. ఈ నిధులతో ఆలయం వద్ద వాటర్ ట్యాంకును నిర్మించాలన్నారు. నగదును ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

- **విధుల్లో చేరిన ఎంపీడీవో**

ఎల్లారెడ్డిపేట: మండల ఎంపీడీవోగా సత్తయ్య గురువారం విధుల్లో చేరారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన చిరంజీవి జగిత్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సత్తయ్య ఎల్లారెడ్డిపేట, నారాయణపూర్ గ్రామాల ప్రత్యేకాధికారిగా పనిచేయనున్నారు. ఎంపీడీవోను పలువురు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్ శాలువాతో సన్మానించారు.

- **సిద్దోగం వేడుకలు**

వీర్నపల్లి: మండలంలోని అడవిపదిరలో పెద్దమ్మ సిద్దోగం వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ముదిరాజ్ కుల సంఘల నాయకులు పాల్గొన్నారు.

- **నేటినుంచి ఈకేవైసీపై స్పెషల్ డ్రైవ్**

బోయినపల్లి: మండలంలోని రైతువేదిక క్లస్టర్ల పరిధిలోని గ్రామాల్లో పీఎం కిసాన్ యోజన ఈ కేవైసీ నమోదు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు ఎంఏఓ ప్రణీత తెలిపారు. ఈనెల 16న కొదురుపాక రైతువేదికలో కొదురుపాక, కొత్తపేట, మాన్వాడ, మల్లాపూర్, నర్సింగాపూర్, నీలోజిపల్లి, వెంకట్రావుపల్లి, ఈనెల 19న బోయినపల్లి రైతువేదికలో బోయినపల్లి, తడగొండ, బూర్గుపల్లి, మల్కాపూర్, అనంతపల్లి, రామన్నపేట, ఈ నెల 20న కోరెం రైతువేదికలో కోరెం, దుండ్రపల్లి, గుండన్నపల్లి, స్తంభంపల్లి, వరదవెల్లి, ఈ నెల 21న విలాసాగర్ రైతువేదికలో విలాసాగర్, దేశాయిపల్లి, జగ్గారావుపల్లి, మర్లపేట, రత్నంపేట గ్రామాల రైతులకు ఈ కేవైసీపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. పీఎం కిసాన్ యోజన పథకంలో ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ లింకేజీ చేయించుకోవాలన్నారు. మండలంలో ఆధార్‌కార్డు లింక్ చేయించుకోని రైతులు 222 మంది, ఈకేవైసీ చేయించుకోని రైతులు 96 మంది రైతులు ఉన్నట్లు తెలిపారు.

- **వన్ డిస్ట్రిక్ట్ వన్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక**

సిరిసిల్లఎడ్యుకేషన్: గతేడాది రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఇంటింటా ఇన్నోవేటర్ –2023 కార్యక్రమంలో ప్రతిభ చూపి ఉత్తమ అవార్డును దమ్మన్నపేట్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని పొన్నాల వినీల సాధించింది. గ్రామీణ ఇన్నోవేటర్‌గా రికార్డు నెలకొల్పింది. తెలంగాణ ఇన్నోవేషనల్ సెల్ ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడ్రోజులపాటు నిర్వహించే వన్ డిస్ట్రిక్ట్ వన్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ఎంపికైంది.

- **మతతత్వ దాడులకు పాల్పడే వారిని శిక్షించాలి**

సిరిసిల్లకల్చరల్: బాధితులకు సంఘీభావం తెలిపేందుకు చేవెళ్లకు బీఎస్పీ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టును జిల్లా బీఎస్పీ ప్రతినిధులు ఖండించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను మాట్లాడారు. మతతత్వ దాడులను పాల్పడుతున్న శక్తులను ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు ఖండించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వరదవెలిల స్వామిగౌడ్, కార్యదర్శి ఎనగందుల వెంకన్న, ఇతర ప్రతినిధులు బొడ్డు మహేందర్, అరుకాల రమేశ్, లింగంపల్లి మధుకర్, మేర్గు రాజు, సగ్గుపాటి నరేశ్, బందెల దేవరాజు, తడుక భాను, గుంటుకు రమేశ్, మేర్గు శ్రీనివాస్, గడ్డం కమలాకర్, గుండు ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు

- **నిందితులపై సస్పెక్ట్ షీట్**

తంగళ్లపల్లి (సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలంలోని పలువురు నిందితులపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేసినట్లు ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్ తెలిపారు. గంజాయి కేసుల్లో మంతెన శ్రీకాంత్ అలియాస్ చింటు రహీంఖాన్‌పేట, దొమ్మాటి అరవింద్ ఇల్లంతకుంట, దొమ్మాటి నవీన్ ఇల్లంతకుంట, దొంగతనం కేసులో తిప్పాపూర్‌కు చెందిన కొడిముంజ రాజమౌళి, తిరుపతి, దాచారం హత్యకేసులో నిందితుడు దరిపెల్లి వంశీలపై గురువారం సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేసినట్లు పేర్కొన్నారు.

ముగిసిన పారిశుధ్య కార్యక్రమాలు

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. గ్రామంలో ప్రత్యేకపారిశుధ్య కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను వివరించారు.